సాక్షి
కుమురం భీం

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024

ఎమ్మెల్యే కోవలక్ష్మికి పరామర్శ



ఆసిఫాబాద్‌అర్బన్: ఎమ్మెల్యే కోవ లక్ష్మి తీవ్ర అస్వస్థతకు గురైంది. విషయం తెలును కున్న సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మా జీ ఎమ్మెల్యే పుట్ట మధు కోవలక్ష్మిని హైదరా బాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి పరామర్శిం చారు. ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు.

విభజనగుట్టు.. ఆయనకే ఎరుక!



ఆసిఫాబాద్ పట్టణం

- అస్తవ్యస్తంగా పంచాయతీ, పురపాలిక విభజన
- అభ్యంతరాలకు పరిష్కారం చూపకనే తుది నిర్ణయం
- స్పెషల్ ఆఫీసర్ సంతకం లేకుండా పురపాలక శాఖకు దస్త్రం
- ఆసిఫాబాద్ మున్సిపాలిటీ వార్డుల విభజనపై అనుమానాలు
- పురపాలక శాఖ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే కోవలక్ష్మి

సాక్షి, ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ మున్సిపాలిటీ వార్డుల విభజనపై ప్రజల్లో అయోమయం నెలకొంది. వార్డుల విభజన ప్రక్రియ అంతా మున్సిపాలిటీ అధికారి కనుసన్నల్లోనే జరగడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ భూముల విషయంలో పారదర్శకత పాటించకుండా.. కొందరికి మాత్రమే మేలు చేసే విధంగా నిర్ణయాలు తీసుకోవడం వెనుక భారీ మొత్తంలో డబ్బు చేతులు మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న ఆర్డీవో లోకేశ్వరరావు క్షేత్రస్థాయిలో పర్యటించి మున్సిపాలిటీ హద్దులను నిర్ణయించగా.. ఆయనకు సైతం తెలియకుండా మరికొన్ని భవనాలను మున్సిపాలిటీలో చేర్చినట్లు సమాచారం. అంతే కాకుండా.. స్పెషల్ ఆఫీసర్ సంతకం తీసుకోకుండానే వార్డుల విభజన దస్త్రాన్ని పురపాలక శాఖకు పంపించడం వెనుకా అధికారపార్టీ నేతల ఒత్తిళ్లు ఉన్నాయని తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి అస్తవ్యస్తంగా రూపొందించిన వార్డుల విభజన తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ పురపాలకశాఖ ముఖ్య అధికారికే ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఇష్టారాజ్యంగా సర్వే...

పంచాయతీగా ఉన్న ఆసిఫాబాద్‌ను మున్సిపాలిటీగా నిర్ణయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీగా ఏర్పాటు కానున్న ఆసిఫాబాద్ పట్టణాన్ని 20వార్డులుగా విభజించి సరిహద్దులను బల్దియా, రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. అందుకోసం ప్రజల నుంచి అభ్యంతరాలను కోరుతూ వార్డుల వారీగా ఇళ్లు, ఓటర్లను విభజించి ప్రకటన జారీ చేశారు. అయితే సరిహద్దులను గుర్తించేందుకు చేపట్టిన సర్వే లోపభూయిష్టంగా ఉండటంపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ కమిషనర్ భుజంగరావు ఇష్టారాజ్యంగా సరిహద్దులు నిర్ణయించారని జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. అస్తవ్యస్తంగా వార్డుల విభజనపై 12దరఖాస్తుల ద్వారా అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించారా?

ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఇళ్లను మైదాన ప్రాంతంలోకి, మైదాన ప్రాంతంలోని వాటిని ఏజెన్సీలో కలుపుతూ చేపట్టిన వార్డుల, ఓటర్ల విభజన అంశంలో మున్సిపాలిటీ అధికారులు కలెక్టర్‌ను సైతం తప్పుదోవ పట్టించారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. స్పెషల్ ఆఫీసర్ నిర్ణయాన్ని కాదని.. ఆయన సంతకం లేకుండానే.. దస్త్రాన్ని కలెక్టర్‌కు పంపడం వెనుక ఎవరికో లబ్ధిచేకూర్చాలనే ఉద్దేశం ఉన్నట్లు స్పష్టమవుతోందని పురపాలక ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు. అగమేఘాలపై ఫైలును పంపడమే ఇందుకు నిదర్శనమని పేర్కొంటున్నారు. కలెక్టర్ కూడా స్పెషల్ ఆఫీసర్‌తో చర్చించిన తర్వాతే వార్డుల విభజనపై తుది నిర్ణయం తీసుకుని ఉంటే ప్రజలెవరికీ అభ్యంతరాలు ఉండేవి కాదని, నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఉన్నతాధికారికి తెలియకుండానే..

వార్డుల విభజన నేపథ్యంలో మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ లోకేశ్వరరావు క్షేత్రస్థాయి పర్యటన సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాకు ఎదురుగా ఉన్న న్యూ శ్రీకృష్ణా హోటల్ పక్కన ఉన్న రహదారిని ఆనుకొని ఉన్న విష్ణు గ్రాండ్ హోటల్ నుంచి శ్రీరాజరాజేశ్వరి హోటల్ వరకు ఉన్న కమర్షియల్ భవనాలు మున్సిపాలిటీలోకి వస్తాయని తేల్చి చెప్పారు. అదేవిధంగా బస్టాండ్ ప్రాంగణం సైతం మున్సిపాలిటీలోకి వస్తుందని సర్వేయర్ చేత కొలతలు వేయించి నిర్ధారించారు. ఇంతవరకు అంతా బాగానే ఉండగా.. అభ్యంతరాలపై తుది నిర్ణయం తీసుకునే సమయానికి శ్రీరాజరాజేశ్వరి హోటల్ ఆనుకొని ఉన్న తారా లాడ్జీ వరకు ఉన్న 6–29 నుంచి 6–40 వరకు ఉన్న భవనాలు మున్సిపాలిటీలో చేర్చుతూ కమిషనర్ భుజంగరావు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. వాస్తవానికి ఈ భవనాలున్న స్థలాన్ని 1958 సమయంలో అప్పటి ఆసిఫాబాద్ మున్సిపాలిటీ వేలంలో కొనుగోలు చేసినట్లు స్థల యజమానులు పేర్కొంటున్నారు. సర్వేయర్‌తో కొలతలు వేశాక కూడా మళ్లీ కొన్నింటిని మున్సిపాలిటీలోకి చేర్చడంపైనా ఇటు స్పెషల్ ఆఫీసర్ నుంచి అటు స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం. వార్డుల విభజన క్రతువంతా తన చేతుల మీదుగా నడిపించిన మున్సిపల్ కమిషనర్, స్పెషల్ ఆఫీసర్ సంతకం లేకుండానే వార్డుల తుది జాబితాను జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ద్వారా పురపాలక శాఖకు పంపించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వార్డుల విభజన ప్రక్రియను అంత గుట్టుగా చేయాల్సిన అవసరం ఎందుకొచ్చిందని పుర ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్ర పురపాలక శాఖకు ఎమ్మెల్యే ఫిర్యాదు?

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి మున్సిపాలిటీ వార్డుల విభజన తీరుపై రాష్ట్ర పురపాలక శాఖ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ, రాజంపేట పంచాయతీ విభజన అంశంలో అనేక పొరపాట్లు చోటు చేసుకున్నాయని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ముఖ్యంగా రాజంపేట పంచాయతీ పరిధిలోకి వచ్చే భవనాలు కొన్నింటిని కావాలనే మున్సిపాలిటీ ప్రాంతంలోకి.. మున్సిపాలిటీలోని కొన్ని ఇళ్లను పంచాయతీలోకి చేర్చారని ఇది చట్ట విరుద్ధమని ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. అవసరమైతే దీనిపై హైకోర్టుకు వెళ్తామని రాష్ట్ర పురపాలక శాఖ అధికారికి చెప్పినట్లు సమాచారం.

సమయపాలన పాటించకుంటే చర్యలు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



విద్యార్థులతో భోజనం చేస్తున్న ఐటీడీఏ పీవో

తిర్యాణి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా హెచ్చరించారు. మండలంలోని గిరిజన సంక్షేమ పాఠశాలలను శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించి రిజిష్టర్లు, తరగతి గదులు, వంటశాలలు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు, ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. వాడిగూడ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఆలస్యంగా రావడం, రాజగూడ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను మూసి ఉంచడంపై సంబంధిత ఎస్‌సీఆర్పీ, ఏసీఎంవోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణపై నిత్యం పర్యవేక్షించాల్సిన ఎస్‌సీఆర్పీ కై లాస్ విధులపై నిర్లక్ష్యం వహించినందుకుగాను వెంటనే సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. భీంజీగూడ పాఠశాలలోని ఉపాధ్యాయుడు విధుల్లో నిర్లక్ష్యం వహించడం, పంగిడిమాదర స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పాఠశాలల్లో సౌకర్యాల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, ఇతర పాఠశాల సంబంధిత అంశాలలో అలసత్వం వహించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి, విద్యార్థుల భవిష్యత్‌కు కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఏసీఎంవో పుర్క ఉద్ధవ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

2న పొలాల పండుగకు సెలవు

ఆసిఫాబాద్‌రూరల్: పొలాల పండుగకు ఈ నెల 2న ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలకు సెలవు ప్రకటించినట్లు పీవో ఖుష్బూ గుప్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలవును తిరిగి ఈ నెల 14న శనివారం పాఠశాలను పనిదినంగా నిర్వహించుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

'భట్టి' పర్యటన రద్దు

జైపూర్/చెన్నూర్‌రూరల్: మంచిర్యాల జిల్లాలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం పర్యటించాల్సి ఉండగా.. ఆకస్మికంగా పర్యటన రద్దయింది. రోజువారీ కార్యక్రమాల్లో ఆలస్యం, ఖమ్మం జిల్లా, డిప్యూటీ సీఎం సొంత నియోజకవర్గం మధిరలో భారీ వర్షాల కారణంగా పర్యటన రద్దు చేసుకున్నారు. పెద్దపల్లి జిల్లాకు హెలికాప్టర్‌లో చేరుకున్న ఆయన అక్కడి పర్యటన ముగిసిన తర్వాత రోడ్డు మార్గాన అక్కడి నుంచి అటే వెళ్లిపోయారు. కాగా, జైపూర్‌లోని ఎస్టీపీపీలో ప్రారంభోత్సవాలు, సందర్శన, చెన్నూర్ మండలం శివలింగాపూర్‌లో సోలార్‌పవర్ ప్లాంటు ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాలు వాయిదా పడ్డాయి.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సదయ్య

ఆసిఫాబాద్‌అర్బన్: శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని డీఎస్పీ సదయ్య అన్నారు. గణేశ్ చతుర్థి, మిలాద్ ఉన్ నబీ పండుగల దృష్ట్యా జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో మత పెద్దలతో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ర్యాలీలు నిర్వహించాల్సిన సమయంలో పోలీసుశాఖ ఇచ్చిన రోడ్డు మ్యాప్ అనుసరించాలని, పోలీసుశాఖకు శాంతికమిటీ సహకరించాలని సూచించారు.

జిల్లాను అగ్రస్థానంలో ఉంచాలి

ఆసిఫాబాద్‌రూరల్: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో జిల్లాను అగ్రస్థానంలో ఉంచాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. డీఈవో అశోక్‌తో కలిసి శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలో 15మండలాల విద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే దేశవ్యాప్తంగా నవంబర్ 19న నిర్వహించనున్నట్లు, ఇందులో భాగంగా 3మాక్ టెస్టులు నిర్వహించడంతో పాటు వారాంతపు పరీక్షలు నిర్వహించి విద్యార్థులు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో అత్యున్నత ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో శ్రీనివాస్, ఎంఈవో, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

చట్ట సభల్లో వాటా లక్ష్యంగా ముందుకు సాగాలి



మాట్లాడుతున్న కమర్తపు మురళి

ఆసిఫాబాద్: చట్టసభల్లో వాటా లక్ష్యంగా పద్మశాలీలు ముందుకు సాగాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన జిల్లా పద్మశాలీ సంఘ సమావేశంలో మాట్లాడారు. 2028సార్వత్రిక ఎన్నికలు లక్ష్యంగా చట్టసభల్లో వాటా లక్ష్యంపై సంఘాన్ని చైతన్యపర్చాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పద్మశాలీలు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు జగన్నాథం, అవ్వారి భాస్కర్, రామచంద్రా రావు, నాయకులు మెతుకు సత్యం, రఘురాం, రమేశ్, నరేందర్, కిషన్, రమేశ్, ఇరుకుల్ల ఆంజనేయులు, మల్లయ్య, రాజయ్య, కొంగ సత్యనారాయణ, రాజమౌళి, శంకర్, శ్రీనివాస్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పాల్గొన్న అధికారులు

- అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేశ్, జిల్లా రవాణాశాఖ అధికారి రాంచందర్, సంబంధిత ప్రభుత్వ అధికారులతో కలిసి రోడ్డు ప్రమాదాల నివారణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో తరచుగా జరిగే ప్రమాద ప్రాంతాలను గుర్తించి సూచిక బోర్డులు, వేగనియంత్రికల ఏర్పాటుతో పాటు అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పించాలి

కౌటాల: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కౌటాల మండలం ముత్తంపేట–పార్డీ రోడ్డు, కుంబారీ గ్రామాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతినగా పంచాయతీ రాజ్ అధికారుల ప్రతిపాదనల మేరకు శనివారం ఆయన రోడ్లను పరిశీలించారు. అధిక లోడ్ వాహనాలను నియంత్రించాలని, క్రషర్ల నుంచి మెటీరియల్ తీసుకొచ్చి రోడ్డు పై గుంతలు పూడ్చాలని ఆదేశించారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

కాగజ్‌నగర్‌రూరల్: గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ఎంపీడీవో కార్యాలయాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటరు నమోదు, సవరణలు, మార్పులు, తొలగింపు అంశాలపై ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఒకే కుటుంబానికి చెందిన వారు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా జాబితా రూపొందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, అదనపు పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- అధికారులతో టెలీ కాన్ఫరెన్స్



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. వచ్చే మూడు రోజుల్లో భారీ వర్ష సూచన నేపథ్యంలో శనివారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేశ్‌లతో కలిసి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, వ్యవసాయ శాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందునా రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల అధికారులు సమన్వయంతో ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాగులు, వంతెనలు, కల్వర్టుల వద్ద సిబ్బందిని నియమించి అటువైపు వెళ్లకుండా పర్యవేక్షించాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని, భారీ వర్షాల నేపథ్యంలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మంచినీటి వనరుల్లో క్లోరినేషన్ చేయాలని, వైద్య శిబిరాలు నిర్వహించి, వైద్య సేవలు అందించాలని తెలిపా రు. సమావేశంలో డీఎంహెచ్‌వో తుకారం, డీపీవో బిక్షపతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వర్షాలపై అప్రమత్తం

- మండలాల్లో ఒక్కో పునరావాస కేంద్రం
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

చింతలమానెపల్లి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది. జిల్లాలో ఎలాంటి ప్రమాదం, నష్టం సంభవించకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. జిల్లాలో అధికారులు హై అలెర్ట్ ప్రకటించారు. జిల్లా కలెక్టర్ మండల అధికారులతో శనివారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు చేశారు. అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు.

పునరావాసకేంద్రాల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. ముంపు, లోతట్టు ప్రాంతాలను గుర్తించి సురక్షిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయాలను కంట్రోల్ రూంలుగా కేటాయించి కంట్రోల్ రూం నంబర్లను ప్రకటించారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సైలను పర్యవేక్షక అధికారులుగా నియమించారు. లోతట్టు గ్రామాల్లో పర్యవేక్షించేందుకు రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ శాఖల సిబ్బందిని నియమించారు. పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్, కౌటాల, సిర్పూర్(టి), ఆసిఫాబాద్, నియోజకవర్గంలో శనివారం భారీ వర్షం నమోదు కాగా ఆదివారం నుంచి భారీ వర్షాలు కురవనున్నట్లు అధికారులు ప్రకటించారు.

సిర్పూర్ నియోజకవర్గంలో కంట్రోల్ రూంలు

మండలం	పునరావాసకేంద్రం	కంట్రోల్‌రూం నం.
చింతలమానెపల్లి	బాలాజీఅనుకోడ రైతువేదిక	94903 57244
కౌటాల	కౌటాల రైతు వేదిక	94909 17452
సిర్పూర్(టి)	కేంద్రం ఏర్పాటు చేయలేదు	
బెజ్జూర్	కేంద్రం ఏర్పాటు చేయలేదు	99088 06799
దహెగాం	బీబ్రా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	93912 90271
పెంచికల్‌పేట్	అగర్‌గూడ ప్రాథమిక పాఠశాల	74166 76290
కాగజ్‌నగర్	కేంద్రం ఏర్పాటు చేయలేదు	9492083936, 94408 26876

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఆసిఫాబాద్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, 24గంటల పాటు రౌండ్ ది క్లాక్ వంతుల వారీగా విధులు నిర్వర్తించాలన్నారు. అత్యవసర సాయం కోసం సంప్రదించే వారి వివరాలను సంబంధిత అధికారులకు అందించి, తక్షణ సేవలు అందేలా చూడాలన్నారు. వర్షాల వల్ల వచ్చే ఇబ్బందులపై ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందించాలన్నారు. అత్యవసర సేవలు పొందేవారి కోసం కంట్రోల్ రూమ్ నం. 63046 86505 సంప్రదించాలని తెలిపారు.



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు


అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్

- జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావ్

ఆసిఫాబాద్‌అర్బన్: అక్రమ కార్యక్రమాల నిర్మూలనలో భాగంగా జిల్లాలో అక్రమాలకు పాల్పడే వారి జాబితా సిద్ధం చేశామని, వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా ఎస్పీ డీవీ. శ్రీనివాస్‌రావు శనివారం పేర్కొన్నారు. భూకబ్జాలకు పాల్పడేవారు, అక్రమంగా భూమిని ఆక్రమించి యజమానులను బెదిరించే వారు, లైసెన్స్ లేకుండా అధిక వడ్డీలకు ఫైనాన్షియల్ చిట్టీలు నడుపుతున్న వారు, చైన్ మార్కెటింగ్ పేరుతో డబ్బులు వసూలు చేసి తర్వాత సంస్థను ఎత్తేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100 లేదా 87126 70505కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి జీవితంలో ఉద్యోగ విరమణ తప్పనిసరి అని, అనంతరం శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని జిల్లా ఎస్పీ డీవీ.శ్రీనివాస్‌రావ్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న ఇద్దరు ఎస్సైలు ప్రకాశ్ చంద్రమిస్త్రి, ఎం.రాములును శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.



ఉద్యోగ విరమణ పొందిన ఎస్సై ప్రకాశ్ చంద్రమిస్త్రి దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావ్

ప్రత్యేక బందోబస్తు

ఆసిఫాబాద్‌అర్బన్: రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లాలో 800మంది పోలీసులతో బందోబస్తు 1200సీసీ కెమెరాల ద్వారా నిఘా పెట్టినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలు నమెదు చేసి అనుమతి పొందాలన్నారు.

మహిళలు, చిన్నపిల్లల రక్షణే ప్రథమ ధ్యేయం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని మహిళలు, చిన్న పిల్లల రక్షణే ధ్యేయంగా షీటీం బృందాలు పనిచేస్తాయని, మహిళలు సమస్యలపై నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లాలో 104 హాట్‌స్పాట్‌లను గుర్తించినట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా రెండు షీటీంలు పనిచేస్తున్నాయని, ఆసిఫాబాద్ డివిజన్ షీటీం నం.87126 70563, కాగజ్‌నగర్ డివిజన్ షీటీం నం.87126 70565, లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ కొనసాగింపు

ఆసిఫాబాద్‌అర్బన్: శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతతను పెంపొందించేందుకు జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు జిల్లాలో 30పోలీస్ యాక్ట్ 1861అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డీవీ.శ్రీనివాస్‌రావ్ శనివారం తెలిపారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం

కాగజ్‌నగర్‌రూరల్/ఆసిఫాబాద్/వాంకిడి: జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. పలుచోట్ల మురుగు నీరు రోడ్లపైనే ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సాయంత్రం సమయం కావడంతో పాఠశాలల నుంచి ఇంటికి వచ్చే విద్యార్థులు అవస్థలు పడ్డారు. లోలెవల్ వంతెనలు ఉండటంతో కొన్ని గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి.



ఖమాన ఒర్రె ఉప్పొంగడంతో నిలిచిన రాకపోకలు



మెయిన్‌మార్కెట్‌లో ముంచెత్తిన వరద

ట్రిపుల్ ఐటీలో గుత్తాధిపత్యం

- యూనివర్సిటీలో టెండరు లేకుండా కాంట్రాక్టర్లకు పనులు
- కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లయినా పాతవారినే కొనసాగింపు
- గత ప్రభుత్వం ఆదేశించినా మారని అధికారులు తీరు
- పనులు అప్పగించడం వెనుక భారీగా అక్రమాలు


ట్రిపుల్ఐటీ పరిసరాలను పరిశీలిస్తున్న అప్పటి గవర్నర్ తమిళసై (ఫైల్)


ట్రిపుల్ఐటీ మెస్లో విద్యార్థినులతో మాట్లాడుతున్న అప్పటి గవర్నర్ తమిళసై (ఫైల్)

భైంసా: విద్యార్థులకు ఉన్నతమైన విద్యాబోధనతో భవిష్యత్కు బంగారు బాటలు వేయాల్సిన బాసర రాజీవ్గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) అవినీతికి కేరాఫ్గా మారింది. విద్యార్థుల సంక్షేమానికి పాటుపడాల్సిన అధికారగణం కాంట్రాక్టర్ల సేవలో తరిస్తున్నారన్న విమర్శ సర్వత్రా వినిపిస్తోంది. కాంట్రాక్టర్ల నజరానాలకు ఆశపడో.. నేతల ఒత్తిళ్లకు తలొగ్గి నిబంధనలకు విరుద్ధంగా యూనివర్సిటీలో పనులు కేటాయిస్తున్నారు. ప్రభుత్వంలో ఏదైనా కాంట్రాక్టు అంటే గడువు ఉంటుంది. ఆ గడువు ముగియగానే నిర్వహణ, వివిధ పనుల కోసం టెండరు నిర్వహించి కొత్తవారిని నియమించాలి. ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగా చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ, బాసర ట్రిపుల్ ఐటీ అధికారులు కాంట్రాక్టర్లు చెప్పిందే వేదంగా భావిస్తూ పాటిస్తున్నారు. కాంట్రాక్టు గడువు ముగిసి ఏళ్లు గడుస్తున్నా నిబంధనలకు విరుద్ధంగా పాతవారినే కొనసాగిస్తున్నారు. పాతవారిపై పలు ఆరోపణలున్నా.. వారి సేవలోనే తరిస్తున్నారు. ఇలా ఒకటి రెండు విషయాల్లో కాదు యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో ఉన్న ప్రైవేటు సంస్థల అన్ని కాంట్రాక్టు గడువులు ముగిసినా ఇంకా కొనసాగించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి కొన్ని సంస్థలపై ఫిర్యాదులు ఉన్నా చర్య తీసుకోకపోవడం, వెంటనే టెండర్లు నిర్వహించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ట్రిపుల్ఐటీ సమస్యలు తెలుసుకునేందుకు అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఇక్కడికి చేరుకుని మెస్లు, పరిసరాలు, వసతిగృహాలు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అయినా ఎలాంటి మార్పురాలేదు. గత ప్రభుత్వ మంత్రులు కేటీఆర్, సబితాఇంద్రారెడ్డి, ఇంద్రకరణ్రెడ్డి యూనివర్సిటీని సందర్శించిన సమయంలో ఆదేశించినా అధికారుల తీరు మారలేదు. పాతవారికే గడువు పెంచుతూ వస్తున్న అధికారులు వేసవిసెలవుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. టెండర్ వేస్తే ఏడాది కాలానికి కాంట్రాక్ట్ వస్తుంది కానీ ఇక్కడ అధికారులు కాంట్రాక్టర్లకు మూడు ఏళ్ల నుంచి రెన్యూవల్ చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో రూ.కోట్ల అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి

జరుగుతుంది ఇదీ...

- యూనివర్సిటీలో హౌస్ కీపింగ్ కాంట్రాక్టు గడువు ముగిసింది. గడువు కంటే రెండు నెలల ముందుగానే టెండరు ప్రక్రియ ముగించి కొత్త వారిని అధికారులు సిద్ధం చేయాలి. కానీ మూడేళ్లు గడిచినా పాతవారినే కొనసాగిస్తున్నారు. సరైన సమయానికి వేతనాలు ఇవ్వక, వారికి రావాల్సిన ప్రయోజనాలు అందజేయకపోవడంతో ప్రస్తుతం ఉన్న సంస్థ తీరును నిరసిస్తూ కార్మికులు అనేక సార్లు ఆందోళనలు చేశారు.
- క్యాంపస్లోని సెక్యూరిటీ బాధ్యతలు నిర్వహించే కంపెనీ కాంట్రాక్టు గడువు సైతం మూడేళ్ల క్రితమే ముగిసింది. ఇంకా సదరు కంపెనీనే అధికారులు కొనసాగిస్తున్నారు.
- యూనివర్సిటీలో 9 వేల మంది విద్యార్థులు ఉండగా వారి భోజన బాధ్యతలు, నిర్వహణను అధికారులు ప్రైవేటు క్యాటరింగ్ సంస్థలకు అప్పగించారు. ఈ మూడు క్యాటరింగ్ సంస్థల కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లు అవుతోంది. కానీ అధికారులు ఇప్పటి వరకు టెండర్లు పిలవడం లేదు. అనేకసార్లు విద్యార్థుల భోజనంలో పురుగులు రావడం, ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి పలు క్యాటరింగ్ సంస్థలపై అనేక ఫిర్యాదలు వచ్చాయి. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. టెండర్ లేకుండా పాతవారినే వారినే కొనసాగిస్తున్నారు.
- యూనివర్సిటీ పరిపాలన అవసరాల కోసం మ్యాన్ పవర్ను అందించే సంస్థ కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లవుతుంది. ఇంకా వారినే కొనసాగిస్తున్నారు.
- యూనివర్సిటీలో సూపర్మార్కెట్, హాస్టల్ భవనాల్లోని జనరల్ స్టోర్స్ ఎలాంటి టెండరు లేకుండా అధికారుల బంధువులకు కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి ఇవి అక్రమంగా కొనసాగుతున్నట్లు సమాచారం. అద్దె కూడా చెల్లించడం లేదని తెలిసింది. వీటిపై అనేక ఫిర్యాదులు ఉన్నా అధికారులు నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోంది.
- ఈ కాంట్రాక్టు సంస్థలు, యూనివర్సిటీకి మధ్య ఒక ఏడాదిలో రూ.60 నుంచి రూ.90 కోట్ల వరకు లావాదేవీలు జరుగుతాయి. పెద్ద ఎత్తున జరిగే ఈ కాంట్రాక్టులు సమయానికి టెండర్ లేకుండా కొనసాగించడానికి అదే స్థాయిలో అవినీతి జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

త్వరలోనే అన్ని టెండర్లు పిలుస్తాం..

యూనివర్సిటీలో గడువు ముగిసి పలు కాంట్రాక్టు సంస్థల స్థానంలో కొత్త టెండర్లు పిలవడంతో కొంత జాప్యం జరిగింది. గడువు ముగిసిన అన్ని కాంట్రాక్టు సంస్థల స్థానంలో కొత్త టెండర్ ఫైళ్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవి రెడీ కాగానే కొత్త టెండర్లు పిలిచి కాంట్రాక్టు అప్పగిస్తాం.

– ప్రొఫెసర్ వెంకటరమణ, ఇన్చార్జి వీసీ

ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విష్ణుకుమార్తో హెచ్ఎం, పీడీ

కాసిపేట: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి బానోతు విష్ణుకుమార్ ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సాంబమూర్తి తెలిపారు. క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం మందమర్రి మండలం బొక్కలగుట్టలో జిల్లాస్థాయి అండర్–14 ఫుట్బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. విష్ణుకుమార్ ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థినిని, పీడీ భుక్య రాజన్నను అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ స్వరూప, ఉపాధ్యాయులు అభినందించారు.

రైళ్లు తాత్కాలికంగా రద్దు

బెల్లంపల్లి: రోజువారీగా ప్రత్యేక రోజుల్లో రాకపోకలు సాగించే పలు ఎక్స్ప్రెస్, సూపర్ఫాస్ట్ ఎక్స్ప్రెస్ రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తూ ద.మ.రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కాజీపేట్–బల్లార్షా మార్గంలో నడిచే పలు ఎక్స్ప్రెస్ రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసి మరికొన్ని సూపర్ఫాస్ట్ ఎక్స్ప్రెస్ రైళ్లను దారిమళ్లించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. రైళ్ల తాత్కాలిక రద్దు ప్రక్రియ ఈనెల 22 నుంచి ప్రారంభం కానుంది. వరంగల్, హసన్పర్తి, కాజీపేట్ రైల్వేస్టేషన్లలో రైల్వే ట్రాక్ మరమ్మతు దృష్ట్యా రద్దు నిర్ణయం తీసుకున్నట్లు ద.మ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ తెలిపారు.

క్లుప్తంగా

దొంగతనం కేసులో ఒకరికి రిమాండ్

కాసిపేట: దొంగతనం కేసులో ఒకరిని శనివారం రిమాండ్కు తరలించినట్లు దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపారు. దేవాపూర్ పోలీస్స్టేషన్ పరిధిలోని తుంగగూడంలో గతనెల 25న మేకల పద్మ ఇంటికి తాళం వేసి ఉంది. ఆమె మరిది కొడుకు శశికుమార్ తాళం పగులగొట్టాడు. బీరువాలో రూ.90 వేలు ఎత్తుకెళ్లారని బాధితురాలు ఫిర్యాదుతో నిందితుడిని రిమాండ్కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్టు

బెల్లంపల్లిరూరల్(తాండూర్): సులభంగా డబ్బులు సంపాదించేందుకు ఓ వ్యక్తి ఇంటి పరిసరాల్లో గంజాయి సాగు చేసి పోలీసులకు పట్టుబడ్డాడు. తాండూర్ ఎస్సై కిరణ్కుమార్ కథనం ప్రకారం.. తాండూర్ మండలం బోయపల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కన దాబా నిర్వహిస్తున్న భటేశ్వర్రాయ్ తన ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నాడని సమాచారం అందింది. పోలీసులు శనివారం అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా ఒక గంజాయి మొక్క, 44 గ్రాముల ఎండు గంజాయి లభించినట్లు ఎస్సై తెలిపారు. భటేశ్వర్ రాయ్పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. గంజాయి సాగు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య


రవి (ఫైల్)

దండేపల్లి: గూడెం గ్రామానికి చెందిన గోపతి రవి (42) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఉదయ్కిరణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..రవి గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రి ఖర్చుల కోసం కొంత అప్పు చేశాడు. అయినప్పటికీ కడుపు నొప్పి తగ్గకపోవడం, పైగా వైద్యఖర్చుల కోసం అప్పులు కావడంతో మనస్తాపం చెందాడు. శనివారం పత్తిచేను వద్దకు వెళ్లి గుర్తుతెలియని పురుగు మందు తాగి ఇంటికి వచ్చి కుటుంబీకులకు విషయం చెప్పాడు. వెంటనే వారు ఆటోలో లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. భార్య సుమలత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

జ్వరంతో విద్యార్థిని మృతి

వాంకిడి: మండలంలోని ఇందానికి చెందిన ఐశ్వర్య (17) జ్వరంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఐశ్వర్య గత వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుంది. తల్లిదండ్రులు మంగళ- భీమ్సన్ ఆమెను మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. కొన్నిరోజులు బాగానే ఉన్నా శుక్రవారం మళ్లీ అస్వస్థతకు గురైంది. శుక్రవారం రాత్రి మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కాగా, ఐశ్వర్య మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండియర్ బైపీసీ గ్రూప్లో చదువుతుంది. ఆమె మృతిపట్ల అధ్యాపకులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేసి కళాశాలకు సెలవు ప్రకటించారు.

కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల ధర్నా


నినాదాలు చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు

బెల్లంపల్లి: ఆరు నెలలుగా పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్టు పారిశుధ్య సిబ్బంది శనివారం ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ మూడు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉండగా ఒక నెల వేతనాలు చెల్లించి చేతులు దులిపేసుకున్నారని విమర్శించారు. వేతనాలు అడిగితే ఉద్యోగంలో నుంచి తొలగిస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రతినెల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వేడుకున్నారు. అనంతరం జిల్లా వైద్య విధాన పరిషత్ కో ఆర్డినేటర్ కోటేశ్వర్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రవికుమార్కు వినతిపత్రం అందజేశారు.

పీహెచ్సీల్లో వైద్యులను నియమించాలి



మాట్లాడుతున్న రవికుమార్

ఆసిఫాబాద్అర్బన్: పీహెచ్సీల్లో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో శనివారం నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులు కేటాయించి పూర్తిచేసి కాలువల ద్వారా రైతులకు సాగునీరందించాలన్నారు. జిల్లాలో వైద్యశాఖ పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. సబ్, ప్రైమరీ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల ద్వారా జిల్లా కేంద్రంలో 44 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం 12 మంది ఉన్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో విష జ్వరాలు ఉన్నాయని, ఇంటర్ చదువుతున్న బాలిక విషజ్వరంతో మృతి చెందడం బాధాకరమన్నారు. విద్యాశాఖలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు నీరు, మరుగుదొడ్లు, రక్షణ ప్రహరీ తదితర వసతులు కరువయ్యాయని అన్నారు. గిరిజన బాలికల డిగ్రీ, ఆశ్రమ బాలికల పాఠశాల సొంత భవనాలు నిర్మించాలన్నారు. సమావేశంలో నాయకులు రాజన్న, దినకర్, శ్రీనివాస్, రాజ్కుమార్, రాజేందర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి


మాట్లాడుతున్న డీఎస్పీ కరుణాకర్

కాగజ్నగర్రూరల్: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేస్తున్నారని కాగజ్నగర్ డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. పట్టణంలోని కాపువాడ, భట్పల్లి చౌరస్తా వద్ద శనివారం కార్డన్సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వంద బైక్లు, మూడు ఆటోలను సీజ్ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద గంజాయి సేవించే యువకులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. మట్కా, ఆన్లైన్ బెట్టింగ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పట్టణ సీఐ శంకరయ్యతోపాటు రూరల్, కౌటాల, వాంకిడి సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వట్టివాగు ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత

ఆసిఫాబాద్రూరల్: వట్టివాగు ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నట్లు సంబంధిత అధికారులు శనివారం తెలిపారు. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి ప్రాజెక్టులో నీరు ఎక్కువ కావడంతో 3, 4గేట్లు 0.50 మీటర్లు పైకి ఎత్తి 1800క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి


కిచెన్ రూమ్ను పరిశీలిస్తున్న డీడీ

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిసారించాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవీందర్రెడ్డి పేర్కొన్నారు. శనివారం 'లెక్కతప్పుతోంది..!'శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించారు. స్థానిక సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిచెన్ స్టోర్ను పరిశీలించారు. హాస్టల్ రూమ్, బాత్రూంలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కిచెన్ షెడ్ లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని విద్యార్థులు డీడీ దృష్టికి తీసుకువచ్చారు. ఏఎస్డబ్ల్యూవో ఆఫీస్ ఇక్కడే ఉండటం వల్ల అసౌకర్యంగా ఉందనగా, సమస్య పరిష్కరిస్తానని హామీఇచ్చారు. ప్రతీ 15రోజులకోసారి మెడికల్ క్యాంపు నిర్వహించాలని, మున్సిపల్ అధికారులతో సంప్రదించి శానిటేషన్ చేయించాలన్నారు. ఆయన వెంట హెచ్డబ్ల్యూవో కుమారస్వామి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బీసీ, ఎస్సీ హాస్టల్లో తనిఖీలు ఉంటాయని ఆయా వార్డెన్లు అలర్ట్ అయ్యారు. మెనూ ప్రకారం భోజనం పెట్టినట్లు తెలుస్తోంది.

దమ్మాల శ్రీనివాస్కు గద్దర్ అవార్డు


గద్దర్ అవార్డు తీసుకుంటున్న దమ్మాల శ్రీనివాస్

శ్రీరాంపూర్/పాతమంచిర్యాల: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా రిటైర్డ్ కార్మికుడు, కళాకారుడు దమ్మాల శ్రీనివాస్కు గద్దర్ అవార్డు అందుకున్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా తొర్రూర్లో ఈ పురస్కారం అందజేశారు. గద్దర్ కూతురు వెన్నెల, తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీ, ప్రొఫెసర్ ఖాసీం చేతులు మీదుగా అవార్డు అందించారు. తనకు గద్దర్ అవార్డు రావడంపై దమ్మాల శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేశారు.


గద్దర్ పురస్కారంతో మురళి..

మండల వాసికి..

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్కు చెందిన కళాకారుడు ముల్కల్ల మురళి గద్దర్ పురస్కారం అందుకున్నాడు. గాయకుడిగా గుర్తింపు పొందిన మురళి తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ ధూంధాం కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. సినిమాలు, వీడియో ఆల్బమ్లలో నటించాడు. తొర్రూర్లో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో మురళికి గద్దర్ పురస్కారం అందజేశారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కోటపల్లి: సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహదినం సందర్భంగా కాంట్రీ బ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు అన్నారు. శనివారం దేవులవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసేవారికి ఎలాంటి భరోసా ఇవ్వని సీపీఎస్ రద్దు చేయాలన్నారు. ఉద్యోగుల ప్రభుత్వ భాగస్వామ్య డబ్బును షేర్ మార్కెట్లో పెట్టుబడి పెట్టి దాని ద్వారా వచ్చే ప్రతిఫలాన్ని పెన్షన్గా ఇవ్వడం సరికాదన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ దిశగా అడుగులు వేసి అమలు చేయాలని కోరారు. లేకపోతే తపస్ అధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు భూమయ్య, శ్రీనివాస్, గోపి పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మె


నిరసన తెలుపుతున్న కన్వెయన్స్ డ్రైవర్లు

శ్రీరాంపూర్: తమ డిమాండ్లు నెరవేర్చకుంటే ఈనెల 11 తర్వాత సమ్మె తప్పదని సింగరేణి కాంట్రాక్ట్ కన్వెయన్స్ డ్రైవర్లు తెలిపారు. శనివారం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఓసీపీ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ మాట్లాడారు. డ్రైవర్లకు అరకొర వేతనాలు అందుతున్నాయని తెలిపారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఉద్యోగ భద్రత ఉండటం లేదన్నారు. ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్చేస్తూ ఇటీవల యజమానికి సమ్మె నోటీస్ ఇచ్చామన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు రాజేశం తదితరులు పాల్గొన్నారు.

'చట్టసభల్లో వాటా లక్ష్యంగా పోరాటాలు'

పాతమంచిర్యాల/జైపూర్: చట్టసభల్లో రాజకీయ వాటాలే లక్ష్యంగా పద్మశాలీలు పోరాటాలు కొనసాగించాలని తెలంగాణ ప్రాంతీయ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి పిలుపునిచ్చారు. శనివారం ఆయన మంచిర్యాల, జైపూర్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2028లో జరిగే ఎన్నికల్లో చట్టసభల్లో రాజకీయ వాటా కోసం పద్మశాలీలను చైతన్యం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంచందర్, కోశాధికారి రఘురాం, జిల్లా సంఘం అధ్యక్షుడు గాదాసు బాపు, ప్రధాన కార్యదర్శి వేముల వీరాస్వామి, వేముల మల్లేశ్, దుస్స భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలో కుళ్లిన కోడిగుడ్లు

కోటపల్లి: మండలంలోని ఎసన్వాయి అంగన్వాడీ కేంద్రానికి కుళ్లిన కోడిగుడ్లు సరఫరా అవుతున్నాయి. గ్రామంలో ఒకరి ఇంట్లో ఉడకబెట్టగా..దుర్వాసన రావడంతో పడేశారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయింది. రోజుల తరబడి నిల్వ ఉన్న కోడిగుడ్లతో చిన్నారులు, బాలింతలు అనారోగ్యం పాలవుతున్నారు. గతనెలలో ఇలా రెండోసారి ఇదే సెక్టార్లో కుళ్లినవి, నాసిరకం గుడ్లు సరఫరా చేయడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. సదరు కాంట్రాక్టర్పై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై సూపర్వైజర్ మాధవిని వివరణ కోరగా కుళ్లిన గుడ్లు వస్తే తిరిగి వెనక్కి ఇవ్వాలని టీచర్లకు సూచించామన్నారు.

కెలిబి శివారులో పులి పాదముద్రలు!


పులి పాదముద్రలు


పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు

- ఆందోళన చెందతున్న ప్రజలు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని కెలిబి శివారులో మొహర్లే రమేశ్, ప్రకాశ్లకు చెందిన పొలాల సమీపంలో ఉన్న చెరువు వద్ద గురువారం పులి పాదముద్రలు కనిపించాయి. ఐదారు రోజులుగా పొలంలో అరక దున్నుతున్నప్పుడు ఎడ్లు చెరువు వద్దకు వెళ్లగానే వెనక్కు మళ్లుతున్నాయని, ఇదేమిటని శనివారం చెరువువద్ద వెళ్లి చూడగా పందిని హతమార్చినట్లు తెలిసిందని రైతులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఎఫ్ఆర్వో మజారొద్దీన్కి తెలుపగా అటవీ సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి చూశారు. పులి పాదముద్రలుగా గుర్తించి, మూడు రోజుల క్రితం ఏర్పడినవని తెలిపారు. పులి సంచారం విషయం సమీప గ్రామాల ప్రజలకు దావానంలా వ్యాపించడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పలు సూచనలు ఇస్తామని ఎఫ్ఆర్వో తెలిపారు. అధికారులు స్రవంతి, వందన, నజీర్అలీ, జమీర్, గౌసుద్దీన్ ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

రామకృష్ణాపూర్: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని శనివారం అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. స్థానిక పోలీస్స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని సీహెచ్పీ సమీపంలో గల సింగరేణి బీ టైపు క్వార్టర్స్లో గంజాయి సేవిస్తూ అమ్మకాలు సాగిస్తున్నారన్న సమాచారంతో పట్టణ ఎస్ఐ రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి వెళ్లారు. వారిని చూసిన నలుగురు తమ వద్ద ఉన్న ఓ కవర్తో పారిపోయే ప్రయత్నం చేయగా వెంటనే పట్టుకున్నారు. కవర్ను తెరిచి చూడగా అందులో 355 గ్రాముల గంజాయి దొరికిందని ఏసీపీ వివరించారు. నిందితులు కొలిపాక అరవింద్రెడ్డి, జాడి కిరణ్, వేల్పుల రాకేశ్, మహమ్మద్ షఫీలను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మందమర్రి సీఐ శశిధర్రెడ్డి, పట్టణ ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.